వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
మంగళవారం 15 అక్టోబర్ 2024

# అందరూ అలర్టు



**రాజంపేట,అక్టోబర్ 14,ప్రభాతవవార్త :**

రాజంపేట డివిజన్ పరిధిలోని ప్రజలందరూ అలర్ట్ గా ఉండాలని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోం నైదియా దేవి హెచ్చరికలు జారీ చేశారు. సోమవారం 14 నుంచి ఈ నెల 16 వరకు భారీ వర్షాం కురుస్తుందని తెలిపారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ నుంచి వచ్చిన ఈ సమాచారం మేరకు వర్షంతో పాటు పిడుగులు కూడా పడే అవకాశం అధికంగా ఉండబోతుందని తెలిపారు. దీంతో అత్యవసర పరిస్థితులలో తప్ప ఎవరూ బయటకు పోకూడదని తెలిపారు. పశువుల కాపరులు మేత కోసం పశువుల మేత కోసం వెళ్లకూడదు అని అతిజాగ్రత్తలు పాటించి ప్రాణనష్టం, పశునష్టం జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా ప్రభుత్వ శాఖల అధికారులు కూడా ప్రజలకు జాగ్రత్తల పట్ల అవగాహన కల్గించి అందుబాటులో ఉండాలని కూడా తెలియజేశారు. ఏదైనా జరిగితే తక్షణం అత్యవసరం కోసం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నెంబర్ : 08565240079కు సంప్రదించాలని ఆమె తెలియజేశారు.

## ఉపాధి నిధులతో పల్లెలకు మరింత ప్రగతి

**చిట్వేలి, అక్టోబరు 14, ప్రభాతవార్త:**

మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో పల్లెల్లో మరింత ప్రగతి చేకూరనున్నట్లు మండల అభివృద్ధి అదికారి శివరామిరెడ్డి అన్నారు. సోమవారం పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలను రాజుకుంట పంచాయతీలో నిర్వహించారు. రూ.10లక్షల నిధులతో చింతల చెలిక గ్రామంలో 259 మీటర్ల సిమెంటు రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీవో చంద్రకళ, ఈఓపీఆర్డీ శివకుమార్, ఏఈపీఆర్ జగదీష్, పంచాయతీ కార్యదర్శి రమణయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



# అధికారులు సమన్వయంతో పని చేయాలి

- త్వరలో మహిళలకు ఉచిత బస్సుప్రయాణం - రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి





**లక్కిరెడ్డిపల్లె, అక్టోబర్ 14, ప్రభాతవార్త :**

అధికారులు సమన్వయంతో పని చేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర రవాణా, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం లక్కిరెడ్డిపల్లె మండల సమావేశ భవనంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లె మండలం గతంలో అభివృద్ధికి నోచుకోక ఎంతో వెనుకబడి ఉందని, ఇక్కడున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరూ సమన్వయంతో రాజకీయాలకతీతంగా పని చేయాలన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం ఏర్పడినప్పటికీ ఇక్కడ మౌళిక వసతులు సరిగా లేవని, త్వరలో ప్రతి కార్యాలయానికి అన్ని మౌళిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గం లోని రాయచోటి, సంబేపల్లె, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం ఆరు మండలాల్లో మంచి నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో అధిక వర్షాభావ పరిస్థితులు ఉండడంతో నియోజకవర్గంలోని పలు గ్రామాలలో తాగునీటి ఎద్దడి నివారించేందుకు నూతన బోర్లు వేసి సమస్య పరిష్కరించడం జరఉగుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 100 రోజుల లోనే ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గతంలో ఎవరూ చేయని విధంగా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కల్లల్లా భావించి ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. రాయచోటి నియోజకవర్గంలో 14.5 కోట్ల రూపాయలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరుగుతుందన్నారు. పింఛన్ల పెంపు, మెగా డిఎస్సీ వంటి పథకాలు అమలు చేసి నిరుద్యోగ సమస్య పారదర్శకంగా భర్తీ చేసిందన్నారు. ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని, పేదల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. రాబోయే దీపావళికి పేదలు ఉచిత మూడు సిలిండర్లు అమలు, త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు మదన్ మోహన్, తహశీల్దార్ లక్ష్మీప్రసన్న, ఎంపిడిఓ రెడ్డెయ్య, ఎంఇఓ చక్రేనాయక్, విద్యుత్‌శాఖ ఏఇ హరినాథ్, హార్టికల్చర్ ఏఓ నాగమణి, అగ్రికల్చర్ రమేష్‌బాబు, సయ్యద్ అమీర్, వెంకటనారాయణరెడ్డి, నాగిరెడ్డి, మాజీ జడ్పిటిసి రెడ్డెయ్య యాదవ్, రాజంపేట డాక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి షఫీ నాయక్, బాబుల్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



**గాలివీడు, అక్టోబర్ 14(ప్రభాతవార్త):**

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తున్నామని రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం మండలంలోని అరవీడు, అరవీడు హరిజనవాడ, గాలివీడు, గోరాంచెరువు, పూలికుంట పంచాయతీలలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సిమెంట్‌రోడ్లకు భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నారని అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా కోట్ల రూపాయలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతున్నదని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామాలను పట్టించుకోకపోవడం వల్ల అభివృద్ధిలో వెనుకబడిపోయాయని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల అభివృద్ధి కోసం నిధులను కేటాయించడం జరిగిందని తెలిపారు. గాలివీడు మండలంలో రూ.2.15 కోట్లతో మొదటి విడతలో సిమెంట్‌రోడ్డు నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. త్వరలో మరికొన్ని సిమెంట్‌రోడ్లను మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఏ గ్రామంలో కూడా తాగునీటి సమస్య లేకుండా చేయడం కోసం ఎప్పటికప్పుడు మంచినీటి బోర్లు వేయడం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మండల, గ్రామ టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా ఒక్కప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- 15, 16 తేదీల్లో అధిక వర్షాలు ఉన్నట్లు వాతావరణ సూచన
- వాగులు, వంకలు, నదులు, ఉప నదుల గుట్టలను పరిశీలించాలి
- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



**రాయచోటి, అక్టోబరు 14, ప్రభాతవార్త:**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వలన కురుస్తునన భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ఎక్కడ కూడా ఒక్క ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రభుత్వ శాఖాధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకొని మానవ పశు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. రానున్న 15, 16 తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇరిగేషన్, పంచాయతీశాఖాధికారులు, ఇరిగేషన్ శాఖాధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ, రెవెన్యూ శాఖ, విద్యుత్తు శాఖ, వైద్యశాఖ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ, అగ్నిమాపక శాఖాధికారులు వారు వారు తీసుకోవాల్సిన చర్యలు, చేయాల్సిన పనులను వివరించారు. ఉద్యోగులు ఎవరూ సెలవులు పెట్టరాదని ఇప్పటికే ఎవరైనా సెలవుల్లో ఉంటే వారి సెలవులు రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాయచోటి జిల్లా కలెక్టరేట్‌లో 08561-293006 నెంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూంలో 24/7 ప్రకారం సిబ్బందిని విధులకు నియమించడం జరిగింది.

# అన్నమయ్య, కడప జిల్లాల్లో ప్రశాంతంగా మద్యం దుకాణాల కేటాయింపు

స్వయంగా లాటరీలు తీసిన కలెక్టర్లు... కూటమిసేనులకు భారీగా మద్యం దుకాణాలు

పార్టనర్‌సిప్ వ్యూహంతో అనుకున్నవారికి దుకాణాలు... ప్రభుత్వానికి ఆదాయం





మద్యం దుకాణాలకు డ్రిప్ తీస్తున్న కడప జిల్లా కలెక్టర్ శివశంకర్ మరియు అన్నమయ్య జిల్లా జెసి మరియు కలెక్టర్‌లు

**రాజంపేట అర్బన్, అక్టోబరు 14, ప్రభాతవార్త**

అన్నమయ్య, కడప జిల్లాలలో సోమవారం మద్యం దుకాణాల కేటాయింపు ప్రశాంతంగా పారదర్శంగా జరిగింది. మద్యం దుకాణాల కేటాయింపులో అపోహలకు తావులేకుండా స్వయంగా అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, కడప కలెక్టర్ శివశంకర్‌లు స్వయంగా లాటరీని తీశారు. అన్నమయ్య జిల్లాలో 111 మద్యం దుకాణాలకు 2160 మంది దరఖాస్తు చేసుకున్నారు. కడప జిల్లాలో 139 దుకాణాలకు 3257 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు ద్వారానే ప్రభుత్వానికి రూ.108 కోట్ల ఆదాయం లభించింది. రాయచోటిలో అన్నమయ్య జిల్లాకు సంబంధించి స్థానిక అజయ్ కన్వెక్షన్ సెంటర్లో లాటరీ పద్ధతి వ్యవస్థకు కలెక్టర్ నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దరఖాస్తు దారులు అందరూ చూసేలా కలెక్టర్, జెసి ఆదర్శ రాజేంద్రన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్‌లు లాటరీ ప్రక్రియను నిర్వహించారు. మొదటి లాటరీని జెసి రాజేంద్రన్ డ్రా తీసి లైసెన్సు దారున్ని నెంబరు ప్రకారం ఖరారు చేశారు. అదేవిధంగా 111 మద్యం దుకాణాలకు వరుసగా డిప్ తీసి వెంటనే దరఖాస్తుదారుల పేర్లను అప్పటికప్పుడు ప్రకటించారు. అన్నమయ్యజిల్లాలో ఎక్కువ చోట్ల ఎక్కువ మద్యం దుకాణాలు కూటమి నేతలు చేజెక్కించుకున్నారు. మద్యం దుకాణాలు పొందే విషయంలో కూటమి నేతలు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఎక్కడ మద్యం దుకాణంతో అక్కడ పోటీపడుతున్న కూటమి నేతలు ముందే ఒక్కొక్క దుకాణాకి పోటీపడుతున్నారో అందరూ దుకాణం కోసం దరఖాస్తు చేశారు. దీనివల్ల ఇతరులు ఎక్కువ మంది అధికారపార్టీ నేతలు పలానా దుకాణానికి పోటీపడుతున్నారనే విషయం తెలిసి పక్కకు తప్పుకున్నారు. ఇది కూడా వారికి కలిసొచ్చింది. అదే సమయంలో ముందే నిర్ణయించుకున్న మేరకు ఎవెరెవరికి ఎంత షేరు ఖరారు చేసుకుని ప్రతి ఒక్కరూ ఒక దరఖాస్తు చేశారు. దీని వల్ల పోటీపడిన వారిలో ఎవరికో ఒకరికి మద్యం దుకాణం దక్కడం అనివార్యమైంది. ఈ వ్యూహం వారి దృష్టిలో కరెక్టు అయినా ప్రభుత్వానికి కూడా దరఖాస్తు రూపంలో భారీ ఎత్తున ఆదాయం లబించింది. ఉదాహరణకు రాజంపేటలో 5 దుకాణాలకు 18 నుండి 24 మంది పోటీ పడ్డారు. అన్ని దుకాణాలు కూటమి నేతలకే దక్కాయి. అదేవిధంగా కడపలో కూడా ఎమ్మెల్యే మాధవి రెడ్డి అనుచరులు ఎక్కువ కైవసం చేసుకున్నట్లు సమాచారం. కడప జిల్లాలో మద్యం లాటరీ ప్రక్రియను జడ్పీ సమావేశం హాలులో కలెక్టర్ శివశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి లాటరీ ప్రక్రియను కలెక్టర్, జెసి అదితిసింగ్‌లు నిర్వహించారు. దరఖాస్తుదారుల ఎదుటే పారదర్శకంగా లాటరీ ప్రక్రియ నిర్వహించడంతో ఎలాంటి అపోహలకు అవకాశం లేకుండాపోయింది. దరఖాస్తు దారులు కనీసం అధికారులను ప్రశ్నించే అధికారం కూడా ఇవ్వకుండా పక్కా ప్రణాళికతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజు, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కెవిఆర్ కాలనీలో సిసి రోడ్లకు

# ఎమ్మెల్యే వరద భూమి పూజ



**ప్రొద్దుటూరు, అక్టోబర్ 14,ప్రభాతవవార్త :**

ప్రొద్దుటూరు మండలం చౌటపల్లి పంచాయితీ పరిధిలోని కేవిఆర్ కాలనీలో రూ.30లక్షల అంచనా వ్యయంతో 600 మీటర్ల సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తుతున్న సంగతి తెలిసిందే అందులో భాగంగా నాయోజకవర్గంలో గత సెప్టంబర్‌లో నిర్వహించిన పంచాయితీ సర్వసభ్య సమావేశాలలో ఎంచుకున్న పనులకు ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరద మాట్లాడుతూ గ్రామ పంచాయితీలను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు పంచాయితీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ లు వినూత్న ఆలోచనలతో గతంలో పంచాయితీల సర్వసభ్య సమావేశంలో ఎన్నికైన పనులను నేటి నుంచి ప్రారంభిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 84 పనులకు గాను ఉపాధి హామీ పనుల క్రింద 8 కోట్లా 40లక్షలు రూపాయలు నిదులు మంజూ రయ్యాయని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమమంలో టిడిపి నాయకులు చౌటపల్లి మార్తల లక్ష్మీరెడ్డి, అరవ మునివర రమణారెడ్డి, మరియు పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఈవిఎంలపై ఉన్న అనుమానాలను

# నివృత్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల కమీషన్‌దే

50 శాతం ఈవిఎం ప్యాడ్ల లెక్కింపు జరపాలని డిమండ్... సుప్రింకోర్టు జోక్యం చేసుకోవాలి

ఈవిఎం లపై పూర్తిగా విశ్వాసం కోల్పోయా : మాజీ ఎమ్మెల్యే రాచమల్లు



**ప్రొద్దుటూరు, అక్టోబర్ 14,ప్రభాతవవార్త :**

ప్రపంచంలోనే ప్రజాస్వామ్య వ్యవస్థ లో ఉన్న అతి పెద్ద భారతదేశం ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో ఉపయోగించే ఈవిఎంల వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థ కు భంగం వాటిల్లే ప్రమాదం ఏర్పడుతోందని మాజీ ఎమ్మెల్యే రామచల్లు శివప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత నాలుగు నెలల క్రితం జరిగిన ఎన్నికలలో ఈవిఎంల వల్ల ప్రజాభిప్రాయం గెలవలేదని కేవలం కాజకీయ శక్తులు శాసనం గెలిచిందని ధ్వజమెత్తారు. ఎన్నికల ఫలితాల అనంతరం ప్రజలంతా ఏకకంఠంతో వైసిపికి ఓటు వేసినా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఎలా విజయం సాధించిందని ఈవిఎం లలో లోపం ఉందని ప్రజలు నాడే చెప్పినదాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు బ్యాలెట్ ద్వారా నిర్వహించినా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 140 సీట్లు సాధిస్తుందని అన్నారు. ప్రపంచంలో 18దేశాలు మాత్రమే ఈవిఎంలు ఉపయోగిస్తున్నాయని అతి పెద్ద ప్రజాస్వాయ్య దేశాలు కూడా బ్యాలెట్ పేపర్ నిర్వహణకు ఉపయోగిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఈవిఎంల వల్ల ప్రజాస్వామ్యం పలుచబడి పోతుందని అన్ని రాష్ట్రాల కాజకీయ నాయకులు ప్రకటిస్తున్నా కేంద్ర ఎన్నికల కమీషన్ స్పంధించకపోవడం దురదృష్టకరం అన్నారు. దేశంలో ఈవిఎం లపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల కమీషన్‌కి ఉందని అన్నారు. గత ఎన్నికల్లోని ఈవిఎం ప్యాడ్లను 50శాతం తెలుగు లెక్కించాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు ఎన్నికల కమీషన్ను విజ్ఞప్తి చేసినా పట్టించుకోక పోవడం పై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. తక్షణమే సుప్రిం కోర్టు జోక్యం చేసుకొని ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీల అనుమానాలను నివృత్తి చేసేలా ఎన్నికల కమీషన్ను ఆదేశించాలని ఆయన కోరారు. రాబోయే 2029 ఎన్నికలలో బ్యాలెట్ పేపర్ కాకుండా తిరిగి ఈవిఎంల తోని ఎన్నికల నిర్వహిస్తే తాను పోటీ చేయనని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి,నాగరాజు వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మాజీ టిడిడి బోర్డు మెంబర్ మారుతి ప్రసాద్, కౌన్సిలర్లు వర్కుటి ఓబుల రెడ్డి, గుర్రం లావణ్య, మన్నే సత్యం కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు ద్వార్శల భాస్కర్ రెడ్డి, నల్లదేశి జంగమయ్య తదితరులు పాల్గొన్నారు.

## పల్లె పండగ వారోత్సవాలకు మంత్రి మండిపల్లి

**సంబేపల్లె, అక్టోబరు 14, ప్రభాతవార్త:**

పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలకు మంగళవారం రాష్ట్ర రవాణా శాఖామంత్రి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొననున్నట్లు ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. ఉదయం 9 గంటలకు సంబేపల్లె మండలం సంబేపల్లె గ్రామం అంబేద్కర్ నగర్ కాలనీలో నూతన బోధన్ ప్రారంభించడం జరుగుతుందన్నారు. 9.30 గంటలకు దేవపట్ల గుడి రోడ్డు 10 గంటలకు నారాయణరెడ్డిపల్లె కేజీబీవీ స్కూలు రోడ్డు నందు సీసీ రోడ్డు నిర్మాణాలకు భూమి పూజ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు అధికారులు హాజరు కావాలన్నారు.

# పంచాయతీ నిధులు రికవరీ ప్రశ్నార్ధకం

రూ.కోట్లు అవినీతి విచారణతో చేతులు దుపుకున్న అధికారులు.... గాడితప్పిన పాలనతో ప్రజలకు తిప్పలు

పీలేరు, అక్టోబరు 14 ప్రభాతవార్త:

వడ్డించేవాడు మనవాడైతే బంతిలో ఎక్కడున్నా ధోకా ఉండదు. అన్న చందాన పీలేరు మేజరు పంచాయతీలో చోటుచేసుకుంది. జిల్లాలోని అతిపెద్ద పంచాయతీ అయిన పీలేరు పంచాయతీ విద్య, వ్యాపార రంగాల్లో దినదినాభివద్ధి చెందుతుంది. గత మూడన్నరేళ్ల కిందట జరిగిన ఎన్నికల్లో పంచాయతీని ఏకగ్రీవం చేసుకున్నారు. సర్పంచి పదవికి తీవ్రపోటీ ఉండటంతో ఇద్దరు సరాసరి రెండున్నరేళ్లు పంచుకుని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈమేరకు రెండున్నర సంవత్సరం అధికారంలో ఉన్న హబీబ్‌బాషా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. అనంతరం జీనత్‌షఫీ అధికారం చేపట్టారు. ఇది ఇలా ఉంటే ఈకాలంలోనే రూ.కోట్లుకు మేర అవినీతి చోటచేసుకుందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పంచాయతీపై ప్రత్యేక దష్టి సారించారు పంచాయతీలో జరిగిన అవినీతి వెలికితీయాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈఫిర్యాదులో పంచాయతీలో నిధులు భారీస్తాయిలో నిధులు దుర్వినియోగం అవకతవకలు జరిగినట్లు అధికారులు తేల్చారు. ఇలా సర్పంచి హబీబ్‌బాషా హయాంలో మొదటి విడత రూ.43, 25,379 రెండోపర్యాయం రూ.37, 48, 805 లక్షలు అవినీతికి పాల్పడినట్లు అధికారులు తేల్చారు. ఇరువురు కలిసి రూ.1,40,43,714 అవినీతి జరిగినట్లు ఉన్నతాధికారులు తేల్చారు. నేను తక్కువ కాదంటూ ఈయన అనంతరం సర్పంచి కుర్చీలో కూర్చున్న జీనత్‌షఫీ 9 నెలల కాలం పాటు కుర్చీలో కూర్చున్నారు. ఈయన హబీబ్‌బాషాతో పోటీపడి రూ.5,33,710 రెండో పర్యాయం రూ.19,17,210 మూడో పర్యాయం రూ.35, 09, 020 నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు అధికారులు తెలిపారు. ఇరువురు కలిసి పంచాయతీలో పనులు చేయకున్నా చేసిన పనులు నాశిరకంగా ఉండటం పనిచేయకున్నా సిబ్బందిని నియమించుకుని వారికి వేతనాలు ఇవ్వడం, తదితర కారణాలతో ఏకంగా రూ.3కోట్లు అప్పులు చూపించారు.



ప్రశ్నార్ధకంగా మారిన రికవరీ ....!

ఇది ఇలా ఉంటే పంచాయతీలో కార్మికులకు నెలసరి వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. అభివద్ధి లేక పాలన గాడి తప్పింది. అవినీతి జరిగినట్లు గుర్తించిన అధికారులు విచారణతో సరిపెట్టుకుని చేతులు దులుపుకున్నారు. దీంతో నిధులు సమకూరక పాలన సాగించలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి అవినీతి జరిగిన నిధులను రికవరీ చేసి పంచాయతీ అభివద్ధికి తోడ్పాటు అందించాల్సి ఉంది. ఈఓ గురుమోహన్ వివరణ పంచాయతీలో జరిగిన నిధులు దుర్వినియోగంపై విచారణ జరిపి ఉన్నతస్థాయి అధికారులకు పంపాము. ఇప్పుడిప్పుడే పాలన గాడిన పెడుతున్నాం. పంచాయతీ అభివద్ధికి పూర్తిస్థాయి తమవంతు బాధ్యతలు నిర్వహిస్తాం.

## తుఫాను ప్రభావంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పీలేరు, అక్టోబరు 14 ప్రభాతవార్త:



అగ్నేయ బంగాళాఖాతం, హిందూ మహాసముద్రంలో ఏర్పడిన ఆవర్తనం తుఫానుగా మారి బుధ, గురువారాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చేసిన హెచ్చరికలు మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీలేరు సర్పంచి డాక్టర్ హబీబ్‌బాషా తెలిపారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన విలేకరులసమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు భారీ వర్షాలతో పొంగే వాగులు, వంకలు, కల్వర్టులు,మ్యాన్‌హోల్స్‌కు దూరంగా ఉండాలన్నారు. వర్షం కురిసే సమయంలో ఒరిగిన విద్యుత్ స్తంభాలు, తీగలు, చెట్లు, హోర్డింగుల కింద ఉండరాదన్నారు. సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. వర్షాలతో పాటు పిడుగులు కూడా పడే అవకాశం ఉండటం వల్ల పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సూచించారు. వర్షాల కారణంగా వచ్చే సీజినల్ వ్యాధులు డెంగీ, మలేరియా, నీటి ద్వారా సంక్రమించే వ్యాధులనుంచి రక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరు ఆరోగ్య చిట్కాలు పాటిస్తూ వర్షాలకు తడవకుండా నీటిని వేడిచేసుకుని తాగాలని తెలియజేశారు. నివాస ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడి కారణంగా ఇళ్లలో విద్యుత్‌షాక్‌లకు గురి కాకుండా తగు జాగ్రత్తలు వహించాలన్నారు. వర్షాకాలంలో పశువులను విద్యుత్ స్తంభాలకు కట్టకూడదన్నారు. పంచాయతీలో ప్రాణ ,పశు,ఆస్తి, పంట నష్టాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా మండల స్థాయి అధికారులు, పీలేరు గ్రామపంచాయతీ కార్యదర్శిని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పరమేష్, విక్టరీ వెంకటరమణారెడ్డి, అత్తార్ కాలేషా, ఆబిద్, వెంకటరమణ, సాంబశివారెడ్డి, సచిన్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివద్ధికి శ్రీకారం

పీలేరు,అక్టోబరు 14ప్రభాతవార్త:



మండలంలోని గ్రామాల అభివద్ధికి శ్రీకారం చుట్టుచున్నట్టు ఎంపీడీఓ శివశంకర్ అన్నారు. సోమవారం మండలంలోని మేళ్లచెరువు, తలపుల, జాండ్ల గ్రామాలలో 7 సీసీ రోడ్లుకు గాను రూ.16లక్షలు ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైందని వివరించారు. అనంతరం సీసీ రోడ్లకు భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ నందకుమార్‌రెడ్డి, పీఆర్ డీఈ మధుసూదన్, ఈఓ పీఆర్డీ లతీఫ్‌ఖాన్, ఏపీఓ మహేశ్వర పాల్గొన్నారు.

## మురిగినీటి కాలువలు మూగజీవులకు ప్రమాదపు నిలయాలు

రాజంపేట,అక్టోబర్ 14,ప్రభాతవవార్త :



రాజంపేట మున్సిపాలిటి పట్టణంలో మురికి నీరు కోసం ఏర్పాటు చేసిన మురికినీటి కాలువలు మూగజీవుల పాటిట ప్రమాదపు నిలయాలుగా మారాయి. మున్సిపాలిటి శాఖ వవారు కాలువలపై అక్కడక్కడా మూతలు లేకుండా వుంచడంతో నిలబడ నీడ లేక ఆదరించే దిక్కులేక ఆకలితో అలమటిస్తూ రోడ్లపై తిరుగుతున్న మూగజీవులు ఈ మురికి నీటి కాలువలో పడి ప్రమాదా పాలవుతున్నాయి. సోమవారం తెల్లవవారుజామునుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి రోడ్డుపై తిరిగే మూగజీవైన ఆవు ప్రమాదపు శాత్తు మూతలేని మురికినీటి కాలువలో పడింది. తిరిగి గట్టేకేందుకు వీలులేక చేతకాక కాలువలో ఇరుక్కొని సుమారు గంటపాటు తీవ్ర ఇబ్బందులకు గురైంది. దీంతో పట్టణంలోని ప్రజలు గమనించి మున్సిపాలిటీ శాఖవారికి సమాచారం అందించి కాలువలో పడి ఇరుక్కుపోయిన ప్రమాదంలో ఉన్న ఆవును ప్రజలు రక్షించారు. ఇలాంటి ప్రమాదాలు జరుగుతూ మూగజీవులు ఇబ్బందిపడుతున్నప్పటికీ మున్సిపాలిటీ అధికారులు వాటి పట్ల చర్యలు తీసుకోవడం లేదు. కబ్జా దారులు పశువుల మేత స్థలాలను ఆక్రమించడంతో వాటికి మేత మేసే మేత బీడు స్థలాలు లేక పట్టణాలలోని ప్రమాదాల మధ్య తిరుగుతూ చెత్తా చెదారాలు తిని జీవిస్తున్నాయి. వీటి పట్ల చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వ శాఖాధికారులు ప్రతిరోజు వాటిని రోడ్డుపై సూస్తూనే చూడనట్లు వెళ్లిపోవడం గమనార్హం. మురుకినీటి కాలువలకు మూతలు సక్రమంగా వేయకపోవడంతో మూగజీవులు వాటిలో పడి ప్రమాదాల పలౌతున్నాయి. ఇదే చిన్నపిల్లలు, వృద్ధులు, ఆ కాలువల్లో పడితే ప్రాణాలు కోల్పోవలసిందేనని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

## రోడ్లపై వాహనాలు నిలిపితే చర్యలు తప్పవు

:వాహనాల తనిఖీలో ఎస్ఐ సత్యనారాయణ

బద్వేలు అర్బన్, అక్టోబర్ 14 ప్రభాతవార్త :

పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా ట్రాఫిక్ రద్దీ ఎక్కువైందని వాహనదారులు రోడ్లపైన ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపి ట్రాఫిక్ అంతరాయానికి గురైతే అలాంటి వారిపై చర్యలు చేపడతామని అర్బన్ ఎస్ఐ మాడిశెట్టి సత్యనారాయణ తెలిపారు. సోమవారం సాయంత్రం ఎస్ఐ సత్యనారాయణ తమ పోలీసు సిబ్బందితో కలిసి పలు ప్రధాన రహదారులలో తిరుగుతూ వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాలు తోలే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాలకు సంబందించిన రికార్డులను సరిచూసుకోవాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన రికార్డులు సక్రమంగా లేకపోతే వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. వాహనాలు తోలేటపుడు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అలాగే మైనర్‌లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. కావున వాహనదారులు పోలీసు నిబంధనలు పాటిస్తూ ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలన్నారు. అలాగే ఆయా దుకాణాల వద్ద వాహనాలు నిలపరాదని, వీరితోపాటు ఆటోలు, తోపుడు బండ్ల వారు ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్నారని కావున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు వహించలన్నారు.



## కొంకుల రాంబాబు సేవలకు డాక్టరేట్ అవార్డు సంతోషకరం

: ఆవోపా సంయుక్త కార్యదర్శి బైసాని కార్తీక్

బద్వేలు అర్బన్, అక్టోబర్ 14 ప్రభాతవార్త :



బద్వేలు పట్టణంలోని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ పట్టణ అధ్యక్షులు కొంకుల రాంబాబు అనేక సంవత్సరాలుగా నిరుపేదలకు అందించిన సేవలను గుర్తించి ఆయనకు డాక్టరేట్ అవార్డు మనం ఫౌండేషన్ వారు అందజేయడం సంతోషకరమైన విషయమని ఆవోపాకమిటి సంయుక్త కార్యదర్శి బైసాని కార్తీక్ కుమార్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కొలిశెట్టి సుమంత్ అన్నారు. సోమవారం డాక్టరేట్ అవార్డు పొందిన రాంబాబును ఆవోపా సంయుక్త కార్యదర్శి బైసాని కార్తీక్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొంకుల రాంబాబు టీడీపీలో ఉంటూ గత అనేక సంవత్సరాలుగా బద్వేలు ప్రాంతంలో ఎంతోమంది నిరుపేదలకు చేయూతనిస్తూ యువతను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ వారు అందించిన నిరంతరాయ సేవలే నేడు ఆయనకు డాక్టరేట్ అవార్డును తెచ్చిపెట్టాయన్నారు. రాబోయే రోజులలో మరిన్ని సేవలందించి ఇలాంటి డాక్టరేట్‌లు పొందాలని వారు ఆకాంక్షించారు.

## మద్యంషాపు నగదు చోరీదారుడు అరెస్టు

- రూ.లక్ష నగదు స్వాధీనం

పులివెందుల, అక్టోబరు 14, ప్రభాతవార్త :



పులివెందుల పట్టణంలోని కదిరిరోడ్డులో ఉన్న ప్రభుత్వ మద్యంషాపునందు ఆగస్టు 13న జరిగిన నగదు చోరీ సంఘటనలో రెండవ నిందితుడు కొవ్వూరు అలెగ్జాండర్‌ను అరెస్టు చేసి అతని వద్ద ఉన్న రూ.లక్ష నగదును స్వాధనం చేసుకున్నట్లు సీఐ జీవన్ గంగనాథ్‌బాబు తెలిపారు. పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 13న మద్యంసాపు నందు సురేష్, అలెగ్జాండర్ అనే ఇరువురు వ్యక్తులు రూ.4,23,160 నగదు దొంగలించారని, అప్పట్లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఎస్పీ పర్యవేక్షణలో డీఎస్పీ సూచనలతో పోలీసు సిబ్బంది కేసును ఛేదించి గత కొన్ని రోజుల క్రితం సురేష్‌ను అదుపులోకి తీసుకుని రూ.2లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో మరో నిందితుడైన ముద్దనూరు మండలం శెట్టివారిపల్లెకు చెందిన కొవ్వూరు అలెగ్జాండర్‌ను ఈనెల 13న ఆర్టీసీ బస్టాండు వద్ద అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నామని, ఈ కేసులో మొత్తం రూ.3లక్షలు స్వాధీనం చేసుకుని మిగిలిన సొమ్ము వారి జల్సాల కోసం ఖర్చు చేశారన్నారు. చోరీ దారుడిని కేసులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నారాయణస్వామి, స్పెషల్ పార్టీ పోలీసులు వేణుగోపాల్‌రెడ్డి, రమేష్, రైటరు మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డీఏ ప్రభుత్వంలో పంచాయతీలకు మహర్ధశ

- భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్

వేంపల్లె, అక్టోబరు 14, ప్రభాతవార్త :



కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు మహర్ధశ పట్టుకున్నట్లు భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిహరిప్రసాద్ అన్నారు. వేంపల్లెలో సోమవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పంచాయతీలను గాలికి వదిలేసి వాటి అభివృద్ధిని ఏనాడూ పట్టించుకోలేదని అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న డబ్బ్ల్ ఇంజన్ సర్కార్‌లో 15వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ నుండి ఏపీ గ్రామీణ స్థానిక సంస్థలకు రూ.988.77కోట్ల నిధులు విడుదల చేశారన్నారు. నేటి నుండి 20వ తేదీ వరకు సాగే పల్లెపండుగ పేరుతో గ్రామీణ పంచాయతీలలో ఉన్న అభివృద్ధి పనులకు ఈ నిధులతో శంకుస్థాపన చేస్తారన్నారు. రాష్ట్రంలో 3000 కిలోమీటర్ల మేర సిమెంటు రోడ్ల నిర్మాణం, 500కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణం, 8 లక్షల కుటుంబాలకు 100రోజుల పని, 25వేల గోకులాలు, పదివేల ఎకరాల్లో నీటి సంరక్షణ ట్రెంచులు నిర్మిస్తారని తెలిపారు. గ్రామరాజ్యంతోనే రామరాజ్యం నిర్మాణం అవుతుందని చెప్పిన గాంధీ ఆశయాలకు అనుగుణంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పనిచేస్తున్నారన్నారు.

## వికసిత భారత్‌లో ఆకలి కేకలా?

వేంపల్లె, అక్టోబరు 14, ప్రభాతవార్త :



వికసిత భారత్‌లో ఆకలి కేకలా? అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన వేంపల్లెలో విలేకర్లతో మాట్లాడారు. ఒకవైపు ప్రధానిమోదీ వికసిత భారత్ అంటే మరోవైపు దేశంలో ఆకలి కేకలు వినిపించడం దురదృష్టకరం అన్నారు. 2024 ఆకలి సూచీలో మొత్తం 127 దేశాల్లో భారత్ 105వ స్థానంలో ఉందన్నారు. దేశ పొరుగున ఉన్న బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక మనకంటే మెరుగైన స్థానంలో ఉన్నాయన్నారు. దేశంలో 13.7శాతం మంది పోషకాహార లోపంతో ఉన్నారన్నారు. ఇది దేశానికి సిగ్గుచేటని తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వట్టి మాటలు కట్టిపెట్టి గట్టిమేలు తలపెట్టవోయ్ అన్న గురజాడ సూక్తితో స్ఫూర్తిని పొంది దేశంలో ఆకలి కేకలు వినపడకుండా, పోషకాహారం లోపం లేకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ సూచిస్తోందన్నారు.

**- విత్తన కొరత లేకుండా చూడండి :** రాష్ట్ర ప్రభుత్వం విత్తన సరఫరాదారులకు పాత బకాయిలు వెంటనే చెల్లించాలని, రబీలో బుడ్డశెనగ విత్తనాల కొరత లేకుండా చూడాలని తులసిరెడ్డి కోరారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో బుడ్డశనగ ప్రధాన పంట అన్నారు. ఇప్పటికే రబీసీజన్ ప్రారంభమైందని, విత్తనాల కొరత తీవ్రంగా ఉందన్నారు. ఒక్క కడప జిల్లాలోనే 822261 హెక్టార్లలో (రబీసీజన్) బుడ్డశెనగ సాగు చేస్తారని ఆయన అన్నారు.

## తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

:ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:



ప్రస్తుతం కడపజిల్లాలో కురుస్తున్న తుఫాన్ పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి అన్నారు. సోమవారం వార్త విలేకరితో ఆయన మాట్లాడుతూ రాబోయే నాలుగైదు రోజులు తుఫాన్ కారణంగా అధిక వర్షం మరియు పెనుగాలులు వీయడం, పిడుగులు పడే ప్రమాదం ఉందని కావున ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ పనులను వాయిదా వేసుకోవాలని, రైతులు తమ పశువులను బయటకు వదలరాదని, అనవసరంగా బయటకు వెళ్లి ప్రమాదాల బారిన పడడం తగదన్నారు. తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు ఈ సమయంలో వేటకు వెళ్లకుండా సురక్షిత ప్రాంతాలలో ఉండాలన్నారు. అలాగే అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ప్రమాద సూచికలను తెలియజేసి, ఏదైనా ప్రమాదాలు జరిగినా తక్షణమే స్పందించాలని సూచించారు.

## గ్రామ స్వరాజ్య స్థాపనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ప్రతి గ్రామానికి పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పన

- సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చిన జగన్

- నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి

పులివెందుల, అక్టోబరు 14, ప్రభాతవార్త :



మన రాష్ట్రంలో ప్రతి గ్రామంలో గ్రామ స్వరాజ్యాన్ని తేవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి అన్నారు. ఆగస్టు 23న నిర్వహించిన గ్రామసభల్లో తీసుకున్న తీర్మానాలకు అనుగుణంగా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న అభివృద్ధి పనుల శ్రీకారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ, పంచాయతీ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం పులివెందుల మండలంలోని ఎర్రిపల్లెలో ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి పాల్గొని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మౌలిక వసతులను పూర్తిగా కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ప్రతి ఏడాది గ్రామసభ నిర్వహించుకుని అందులో గ్రామానికి కావల్సిన అత్యవసర పనులను ప్రజలందరు కలిసి తీర్మానం చేసుకుని ఒక దాని తరువాత ఒకటి పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 4500కోట్ల నిధులతో వేల కిలోమీటర్ల మేర సిమెంటు రోడ్లు, ఎనిమిది లక్షల మంది కుటుంబాలకు 100రోజుల పని, 25వేల గోకులాల నిర్మాణ పనులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఆగస్టు 23న గ్రామసభలో ప్రజలందరు తీర్మానం చేసిన అత్యవసర పనుల్లో భాగంగా 450మందికి 100రోజుల ఉపాధిని కల్పించడం, రూ.5.25లక్షల నిధులతో సిమెంటు రోడ్ల నిర్మాణము, అలాగే గ్రామంలో గోకులాల నిర్మాణాలకు ప్రథమ ప్రాధాన్యతగా పనుల నిర్మాణాలకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. అలాగే ప్రతి ఏడాది గ్రామానికి కావల్సిన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. గత ప్రభుత్వంలో స్థానిక సంస్థలలో అభివృద్ధి జరగలేదని గ్రామ సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి గ్రామంలో గ్రామస్వరాజ్యం తీసుకువస్తామన్నారు. ఇందులో భాగంగానే రూ.4500కోట్ల నిధులతో మౌలిక వసతుల కల్పనను ప్రతి గ్రామంలో కల్పించడంలో భాగంగా నిధులు మంజూరు చేసి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలు ఘర్షణకు దిగకుండా గ్రామానికి సంబంధించిన అభివృద్ధి పనులను సామరస్యంగా చేసుకోవాలని తెలిపారు. సిమెంటు రోడ్లు, బీటీ రోడ్లు, ఇతర నిర్మాణాలు చేసుకోవాలని, గ్రామానికి అత్యవసరమైన ప్రతి ఒక్క పనిని ప్రజలందరు కలిసికట్టుగా చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌ఛార్జి మారెడ్డి జోగిరెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు మద్దూరి వెంకటరామిరెడ్డి, గ్రామ నాయకులు ఎ.వెంకట నారాయణ (ఎక్స్ మిలిటరీ), భాస్కర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, తదితర గ్రామ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం

తొండూరు, అక్టోబరు 14, ప్రభాతవార్త :



పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడపడితే అక్కడ మరుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు కాలువల్లో మట్టి, చెత్త పూడుకుపోయి ఇళ్లల్లోని నీరు రోడ్లపై నిలిచి నీటి గుంతలను తలపిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పల్లెలవైపు కన్నెత్తి చూడడం లేదు. వర్షాకాలం కావడంతో సీజన్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మురుగునీటి కాలువలు లేకపోవడంతో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారింది. పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా కూడా పరిష్కారం కాలేదని గ్రామస్థులు వాపోతున్నారు.

## రాబోయే రెండు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్

సంబేపల్లె, అక్టోబరు 14, ప్రభాతవార్త:

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రాగల రెండు, మూడు రోజుల పాటు అన్నమయ్య జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతులు వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలని సోమవారం తహసీల్దారు వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు వ్యవసాయ కూలీలు చెట్ల కింద ఆరు బయట ప్రాంతాల్లో ఉండకూడదని ఉరుములు మెరుపులతో పిడుగులు పడే అవకాశం ఉందని ప్రజలకు అందుబాటులో ఉండి అధికారులు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## త్రాగునీటి సమస్య లేకుండా చూడడమే ధ్యేయం

వీరబల్లి, అక్టోబర్ 14,ప్రభాతవవార్త :



మండలంలోని మట్లి పంచాయితీలో త్రాగునీటి ఎద్దడి లేకుండా ప్రజలకు నీరు అందించడమే తన ముఖ్య ధ్యేయమని ఆ గ్రామ సర్పంచ్ సోమారపు నాగార్జునా చారి తెలిపారు. సోమవారం ఆయన ఆసాదివాండ్లపల్లెలో ప్రజలు తీవ్ర త్రాగునీటి ఎద్దడికి గురౌతున్నారనే విషయం తెలుసుకొని వెంటనే బోరు బండిని పిలిపించి బోరు వేయడంతో పుష్కలంగా నీరు పడడంతో సర్పంచ్ కృషిని ప్రజలు అభినందించారు. తమ గ్రామంలో ఎక్కడ ప్రజలు త్రాగు నీటి సమస్య ఎదుర్కోనకుండా తాను బృహత్తర ప్రణాలికతో ముందుచూపుతో అభివృద్ధిని తీసుకెళుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ సహకారంతో అధికారుల సహకారంతో గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.

## చౌడేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

వీరబల్లి, అక్టోబర్ 14,ప్రభాతవవార్త :

మండలంలోని మట్లి పంచాయితీలోని తొగటపల్లెలో సోమవారం చౌడేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంమలో బాగంగా భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. అదే రోజు రాత్రి అమ్మవారిని గ్రామంలో పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజలు సురక్షిత ప్రాంతాలలో ఉండాలి

బద్వేలు అర్బన్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:



రాబోయే నాలుగు రోజుల పాటు కురిసే భారీ వర్షాల పట్ల ప్రజల సౌకర్యార్థం వర్షాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు సురక్షిత ప్రాంతాలలో ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయట తిరగరాదని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహా రెడ్డి తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మున్సిపల్ ఆఫీసు కేంద్రంగా కంట్రోలు రూము ఏర్పాటు చేశామని , 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారని ఇందుకు సంబంధించిన నెంబరు 630195 6870 అన్నారు. పాత భవనాలలో, లోతట్లు ప్రాంతాలలో ప్రజలు ఉండరాదన్నారు. ప్రజలకు సేవలందించేందుకు గాను సచివాలయ సిబ్బంది అందరూ హెడ్ క్వార్టర్స్‌లో ఉండాలన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలు కట్టడి చేస్తాం

కడప డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు

కడప క్రైం, అక్టోబరు 14, ప్రభాతవార్త:

అసాంఘిక కార్యకలాపాలను సబ్ డివిజన్ పరిధిలో నియంత్రిస్తామని ప్రజలకు అందుబాటులో ఉంటామని కడప డీఎస్పీగా బాధ్యతలు తీసుకున్న ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. చోరీల నియంత్రణ, రాత్రిళ్లు గస్తీని ముమ్మరం చేస్తామన్నారు. 1991వ బ్యాచ్‌కు చెందిన ఈయన ఎస్సైగా కడపలోని పలు పోలీసు స్టేషన్లలో విధులు ఎనిర్వహించారు. 2006లో సీఐగా పదోన్నతి పొందారు. సీఐగా ఉమ్మడి జిల్లాలో విధులు నిర్వహించారు. డీఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన సీఐడీ విభాగంలో విధులు నిర్వహిస్తూ కడప సబ్ డివిజనల్ అధికారిగా బదిలీపై వచ్చారు.

## 77 మంది పోలీసు సిబ్బంది బదిలీలు

కడప క్రైం, అక్టోబరు 14, ప్రభాతవార్త:

కడప జిల్లాలో పనిచేస్తున్న ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుళ్ల బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 14 మంది ఏఎస్సైలు, 19 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 43 మంది కానిస్టేబుళ్ల బదిలీ అయ్యారు. బదిలీ అయిన సిబ్బంది తక్షణమే వారికి కేటాయించిన పోలీసు స్టేషన్లలో రిపోర్టు చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు.

